## క్లుప్తంగా

### కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కోనా వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారి

**సి.బెళగల్:** మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యాక్రమాలను చేపట్టారు. పూజా కార్యక్రమాలలో స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు కొండపై అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### మాచెర్ల స్వామికి ప్రత్యేక పూజలు



మాచెర్లస్వామికి నైవేద్యం తీసుకెళ్తున్న భక్తులు

**గడివేముల:** మండల కేంద్రమైన గడివేములలోని బొల్లవరం రస్తాలో వెలసిన మాచెర్ల లక్ష్మీ చెన్నకేశవ సహిత ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం వాల్మీకులు భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది వాల్మీకులు పంట దిగుబడులు ఇంటికి వచ్చిన తరువాత సంక్రాంతి ముందు స్వామివారికి కొత్త గింజలతో చేసిన నైవేద్యం పెట్టి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ అర్చకులు చెన్న కేశవయ్యస్వామి తెలిపారు. స్వామి, అమ్మవార్లకు దర్శించుకునేందుకు వచ్చిన వారితో ఆలయ ప్రాంగణాలు కలకళలాడాయి.

### ప్రమాదకరంగా మలుపు



దిన్నేదేవరపాడు గ్రామానికి వెళ్లే రహదారిలో సూచిక లేని ప్రమాదకర మలుపు

**కర్నూలు(రూరల్):** మండల పరిధి లోని దిన్నేదేవరపాడు గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపాన ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఏపీఈఆర్‌సీ భవనం పక్కనే ఉన్నందున ప్రతి నిత్యం వాహనాలు, జిల్లా ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం, బి. తాండ్రాపాడు గ్రామానికి వెళ్లేవారు ఈ రోడ్డుపై నుంచే వెళ్తుంటారు. అయితే మలుపు ప్రమాదకరంగా ఉండటంతో పలు పర్యాయాలు వాహనాలు ఢీ కోనడం, బోల్తాపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. మలుపు వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేవు. దింతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పటు చేసి ప్రమాదాలను నియంత్రించాలని వాహనదారులు కోరుతూన్నారు.

### ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

**కర్నూలు(సెంట్రల్):** ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట ఉపాధ్యక్షుడు కారుమంచి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ రాష్ట్రమహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కడపలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటుచేయాలన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతుండడంతో అందులో రిజర్వేషన్లను కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బీసన్న, కృష్ణ, చంటి, బాబయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

### ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

**కర్నూలు(సెంట్రల్):** ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం బంగారుపేటలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేయతగా గౌతమి వ్యవహరించారు. విజేతలకు విశ్రాంత వైద్యుడు శంకర్ శర్మ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మునెప్ప, జగన్నాథం, రామకృష్ణారెడ్డి, గిడ్డమ్మ, శ్రావని, శ్రీనివాసులు, బీసన్న, శరత్, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

# తొంబై ఏళ్ల బడి.. జ్ఞాపకాల గుడి

- నేడు కొరటమద్దిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- పాఠశాల నిర్మించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల మహాకలయిక
- 80 ఏళ్లు దాటిన వారికి సన్మానం



కొరటమద్ది ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల



కొరటమద్ది గ్రామంలో పోస్టర్లను విడుదల చేస్తున్న పూర్వపు విద్యార్థులు

**గడివేముల:** చదువంటే పెద్దగా విలువ లేని రోజుల్లో వారంతా ఆ ఒడిలో విద్యను అభ్యసించారు. చిన్ననాటి చిలిపి అల్లర్లు, గిల్లికజ్జాలు, మాస్టార్ల మొట్టికాయలు, ఆటపాటల మధ్య చదువు పూర్తి చేసుకున్నారు. కాలక్రమంలో చెట్టుకొకరు, పుట్టకొకరు అయ్యారు. కానీ స్నేహబంధం వారిని ఒక్కచోటకి చేర్చుతోంది. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేసిన పాఠశాలలో చదువుకున్న వారు, అదే వేదిక్పై ఒక్కటై నాటి మధుర స్మృతుల్ని నెమరువేసుకోనున్నారు. గడివేముల మండల పరిధిలోని కొరటమద్ది ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**బ్రిటీష్ కాలంలో స్థాపన..**

గడివేముల మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో 1933 సంవత్సరంలో బ్రిటిష్ వారు ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పుడు పాఠశాల గదులు లేకపోవడంతో స్థానిక చర్చిలో తరగతులను నిర్వహించేవారు. ఈ పాఠశాలలో చదివిన వేలాది మంది విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. నేడు వారు పలు రంగాల్లో రాణిస్తున్నారు. మరి కొందరు ఉన్నత పదవులు అలంకరించి పదవీ విరమణ పొందారు. కొరటమద్ది గ్రామంలో ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాలల 90 వసంతాలు పూర్తి చేసుకున్నది. దీంతో పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ ఆదివారం కలుసుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో చదివిన విద్యార్థులందరి వివరాలు సేకరించి వివిధ ప్రాంతాల్లో ఉన్న వారందరికి ఆహ్వానాలు అందించారు. అపూర్వ కలయికకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**80 సంవత్సరాలు దాటిన వారందరికీ సన్మానం**

పాఠశాల ప్రారంభించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామంలోని 80 ఏళ్లు దాటిన వారందరికీ ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలో దాదాపు 80 ఏళ్లు దాటిన వారు 40 మంది దాకా ఉన్నారన్నారు. దీంతో పాటు విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పాఠశాల అభివృద్ధి కి పెద్దల సలహాలు సూచనలు తీసుకుంటామన్నారు.

**ఉన్నత స్థానాల్లో ఎందరో:**

కొరటమద్ది ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో ప్రభుత్వ ఉన్నత స్థానాల్లో ఉన్నారు. కొంతమంది మంచి స్థానాల్లో పనిచేసి పదవీవిరమణ చెందారు. డాక్టర్ వీవీ నారాయణరెడ్డి ఐఐటీసీ హైదరాబాద్‌లో చీఫ్ సైంటిస్ట్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. హైదరాబాదు మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుశీలమ్మ పనిచేసి రిటైర్ అయ్యారు. మహానంది మండలం గాజులపల్లె జెడ్పీ స్కూల్‌లో వెంకటేశ్వర్లు, (విద్యాధన్ సొసైటీ వ్యవస్థాపకులు) స్కూల్ అసిస్టెంగా ఉద్యోగం చేస్తున్నారు. వాసుదేవ రెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పరిచేస్తున్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రేడియో గ్రాఫర్‌గా సత్యం పనిచేస్తున్నాడు. మనోహర్ పే అండ్ అకౌంట్స్ అఫీసర్‌గా నంద్యాలలో పని చేసి పదవీ విరమణ పొందారు. ఎంతో మంది రాజకీయ, ప్రభుత్వ రంగం, వ్యాపార,పారిశ్రామిక రంగాల్లో మంచి స్థానంలో ఉన్నారు.

### అందరం కలుసుకోవడం అదృష్టం



నేను కొరటమద్ది పాఠశాలలో 1956 నుంచి 60వ సంవత్సరం వరకు 1 నుంచి 5వ తరగతి వరకు చదివాను. 64 ఏళ్ల తరువాత పాఠశాలలో చదివిన విద్యార్థులందరితో పాటు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను కలుసుకోవడం ఎంతో అదృష్టం. ప్రస్తుతం హైదరాబాదులో ఉన్నాను. ఈ పాఠశాల 1933 సంవత్సవం బ్రిటిష్ వారు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పాఠశాలలో చదివిన చాలా మంది ఒకే చోట కలవబోతున్నాం. సొంత ఊర్లో ఇటువంటి సంబరాలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషదాయకం. – **డాక్టర్ వీవీ నారాయణరెడ్డి, రిటైర్డ్ చీఫ్ సైంటిస్ట్, ఐఐసీటీ.హైదరాబాదు**

### ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకుంటున్నాం



నేను కొరటమద్ది పాఠశాలలో 1962వ సంవత్సరంలో 5వ తరగతి పూర్తి చేశాను. 90 ఏళ్ల నుంచి మా గ్రామంలోని పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థులందరం కలుసుకోవడంతో అదృష్టం. తిరిగి ఇన్నేళ్ల తరువాత ఎక్కడెక్కడో స్థిరపడి నేడు అప్పటి మిత్రులను కలుసుకోవడం మాటల్లో చెప్పరాని ఆనందం. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకునే అవకాశం వచ్చింది. పాఠశాలలో మాకు విద్యాబుద్దులు చెప్పిన ఉపాధ్యాయులను ఆశీర్వాదం పొందే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. – **డాక్టర్ సుశీలమ్మ, మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్**

### జన్మలో మరచిపోలేం



1933 ఏటా నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ ఒక్క చోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. పాఠశాలలో చదివిన ఎంతో మంది ప్రభుత్వ పెద్ద పెద్ద ఉద్యోగాల్లో పనిచేసి పదవీ విరమణ పొందారు. వీరితో పాటు మా పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను సన్మానించుకోనే అవకాశం రావడంతో జన్మలో ఎప్పటికి మరచిపోలేనిది. అందరిని ఒక్కచోటికి తీసుకురావడానికి కమిటీ సభ్యులు ఎంతో కష్టపడ్డారు. మా గ్రామంలో ముందే సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. – **వాసుదేవ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల,కర్నూలు**

### ముందస్తు సంక్రాంతి సంబరాలు



ఎద్దులబండిపై వస్తున్న విద్యార్థులు

**పాణ్యం:** మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పలు ప్రదర్శనలు చేశారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ రామిరెడ్డి, ఈసీఈ హెచ్ఓడీ సోఫియా ప్రియదర్శిని ఆధ్వర్యంలో విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి ఎద్దుల బండి ప్రదర్శించారు. బాలికలు పోటీపడి ముగ్గులు వేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు చేసిన నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థినులు, అధ్యాపకులు

### నేడు విద్యుత్ అంతరాయం

**కర్నూలు న్యూసిటీ:** విద్యుత్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఆదివారం క్యాంపు సెక్షన్ పరిధిలో విద్యుత్ నిలిపి వేయనున్నట్లు ఈఈ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ క్యాంపు, విజ్ఞాన మందిరం, బిర్లా కాంపౌండ్, అరోరా నగర్, గాయత్రి ఎస్టేట్, బిర్లాగడ్డ, శ్రీలక్ష్మీనగర్, టెలికాం నగర్, శ్రీలక్ష్మీనర్, డాక్టర్స్ కాలని, జేసీ బంగ్లా, అమ్మ హాస్పిటల్ తదితర కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి



కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్‌ను సన్మానిస్తున్న పి.మోహన్‌బాబు, మండల నాయకులు

**కర్నూలు(రూరల్):** వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులుగా ఎంపికైన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కుడా మాజీ చైర్మన్ కోట్లహర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు మండలాధ్యక్షుడిగా నియమితులైన మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన పి.మోహన్‌బాబు శనివారం వారిని కలిసి సత్కరించారు. తనను మండలాధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లడుతూ మండలంలో కార్యకర్తలు అందరినీ కలుపుకొని పార్టీ కార్యక్రమాలను ప్రజలల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కర్నూలు మండల ఉపాధ్యక్షుడు నెహిమ్యా, సూలేమన్, బొయ చంద్ర, కురువ చిన్న మద్దయ్య, మధుసూదన్‌గౌడ్, మేకలయ్య తదితరులు పాల్గొన్నారు.

**నూతనంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులకు సన్మానం...**

**కోడుమూరు రూరల్ :** వైఎస్సార్‌సీపీ కోడుమూరు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రమేష్‌నాయుడును శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే గూడూరు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రామాంజినేయులు, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్.అస్లామ్‌లను శనివారం గూడూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమళలు, దుశ్శాలువాతో సత్కరించారు. మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమాల్లో వార్డు మెంబర్ హనుమంతు, నాయకులు గోపాల్, ఈరన్న, వెంకటేష్, కమ్మయ్య, గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్ లక్షన్న, కౌన్సిలర్లు ఖలీల్ బాషా, మద్దిలేటి, నంద కిశోర్‌లు పాల్గొన్నారు.

**కృతజ్ఞతలు..**

**సి.బెళగల్:** వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా సోమశేఖర్‌రెడ్డిని మరోసారి కొనసాగిస్తూని శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. శనివారం ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, నియోజకవర్గ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

### సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చాలి

**కర్నూలు(సెంట్రల్):** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు నాయుడు నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఏపీ ఇన్‌చార్జ్ సూర్యం డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అధికారంలోకి రావడానికి లేనిపోని హామీలు ఇచ్చారన్నారు. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు, మహిళలకు నెలకు రూ.1500, రైతులకు రైతు భరోసా కింద రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.5 వేలు భృతి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లను విడుదల చేయాలన్నారు. డీఎస్సీ విడుదల చేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు తిరుపాల్, అర్లప్ప, ఆశీర్వాదం, రాజేష్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కోడుమూరు బాలికల హైస్కూల్లో 1994-95వ బ్యాచ్ పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు

**కోడుమూరు రూరల్:** అక్కడ ఆనందాలు వెల్లివిరిసా యి. వారంతా చిన్ననాడు తాము చదువుకున్న పాఠశాలలో ఎన్నో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 30ఏళ్ల కిందట పాఠశాలలో టీచర్లు చెప్పిన పాఠాలు, స్నేహితులతో కలిసి ఆడి పాడిన ఆటపాటలను గుర్తు చేసుకుంటూ ఆనాటి మధురజ్ఞాపకాల్లో మునిగితేలారు. కోడుమూరులోని బాలికల హైస్కూల్లో 1994- 95 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా 30సంవత్సరాల తర్వాత శనివారం కలుసుకుని అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. కోడుమూరులో ప్రత్యేకంగా బాలికల హైస్కూల్ 1989లో ఏర్పాటు కాగా, 6 నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో చదివిన 1994-95 విద్యార్థినులే మొదటి బ్యాచ్ కావడం గమనార్హం. పూర్వ విద్యార్థులంతా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు కనకమ్మ, సుంకయ్య, శేషగిరిరావు, రాఘవరెడ్డి, అనసూయమ్మలతో పాటు, ప్రస్తుత హెచ్ఎం నాగరాజకుమారిలను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి ఆశ్వీరాదాలు పొందారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు సుభాషిణి, విజయలక్ష్మి, అరుణ, నాగసుశీల, విజయలక్ష్మి, సౌజన్య, మెహరున్నీసా బేగం, నాగేశ్వరి, సెహేనా తదితరులున్నారు.

### జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

**గడివేముల :** మండలంలోని చిందుకూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 14వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు (10వ తరగతి లోపు విద్యార్థులు మాత్రమే) నిర్వహిస్తున్నట్లు నిర్మాహకులు శనివారం తెలిపారు. చిందుకూరు యూత్ ఆధ్వర్యంలో పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20 వేలు, రెండోవ బహుమతి రూ.15 వేల,మూడవ బహుమతి రూ.10 వేల,నాల్గవ బహుమతి రూ.7 వేల, ఐదవ బహుమతి రూ.5 వేలను అందిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 13వ తేదీ లోపు జట్టు పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్లు సురేంద్ర 63029 37348, గణేష్ 70328 05354, రాజు 63018 89618లను సంప్రదించాలన్నారు.

### 15న గోపూజ



ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న గోదా గోకులం పరివారం

**కర్నూలు కల్చరల్:** తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15న కనుమను పురస్కరించుకుని గోపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పేర్కొన్నారు. శనివారం గోదా గో కులంలో కార్యక్రమ ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగర శివారులోని గోదాగోకులంలో వెలసిన గోదా రంగనాథ స్వామి దేవస్థానంలో, నంద్యాల జిల్లా మిడుతూరులోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఉదయం 10 గంటలకు గోపూజ, గో విశిష్టతపై ధార్మిక ప్రవచనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిథులు, భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

### సెలవుల్లో ప్రైవేట్ టీచర్లకు వర్క్‌షాప్

**సి.బెళగల్:** మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్లోబల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో అధికారిక సెలవు దినాలలో అనుమతులు లేకుండా టీచర్లకు శిక్షణ తరగతులను (వర్క్‌షాప్‌ను)ఆ సంస్థ యాజమాన్యం నిర్వహిస్తోంది. శనివారం పాఠశాల యాజమాన్యం ఆయా మండలాలోని వారి పాఠశాలలో పనిచేస్తున్న దాదాపు 200 మంది టీచర్లకు సి.బెళగల్ స్కూల్లో వర్క్‌షాప్ పేరుతో శిక్షణ నిర్వహించింది. అయితే జిల్లా, మండల విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా శిక్షణ తరగతులను నిర్వహించడంపై ప్రైవేట్ స్కూళ్ల ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. శిక్షణ సమాచారం అందుకున్న ప్రైవేట్ సూళ్ల టీచర్లు/లెక్చరర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, కార్యవర్గ సభ్యులు సిద్ధారాముడు, ఎర్రన్న, ప్రవీణ్ తదితరులు పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. దీనిపై డీఈఓకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

**గట్టిగా హెచ్చరించాం**

శనివారం మండల కేంద్రంలోని గ్లోబల్ స్కూల్లో ఏదో టీచర్లకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు అని సమాచారం వచ్చింది. వర్క్‌షాప్‌పై మానుంచి ఎలాంటి అనుమతులు లేవు. దీనితో ఫిర్యాదు అందిన వెంటే ఆ స్కూల్ యాజమానికి ఫోన్ చేసి గట్టిగా హెచ్చరించాం. వారు వర్క్‌షాప్‌ను రద్దు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇకపై అనుమతులు లేకుండా ఇలాంటి పనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. – **జ్యోతి, సి.బెళగల్ ఎంఈఓ**

## కష్టపడే వారికి గుర్తింపు



కాటసాని రాంభూపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పదవులకు ఎంపికైన నేతలు

**కల్లూరు:** పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి గుర్తింపుతో పాటు పదవులు వరిస్తాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పార్టీలో కర్నూలు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన అశోక్‌వర్ధన్ రెడ్డి, కల్లూరు మండలం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన రామకృష్ణారెడ్డి శనివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు అనుగుణంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ సుంకన్న, కె.మార్కాపురం సర్పంచ్ మద్దిలేటి, పర్ల శేఖర్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు**

**గడివేముల:** వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా గడివేములకు చెందిన బొంత మధుసూదనను శుక్రవారం పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా శనివారం ఆయన తన ఎన్నికకు సహకరించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన మధసూదనను మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోండి



గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

**ఓర్వకల్లు :** జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించుకునే గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య సూచించారు. శనివారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో రైతు సి.మహేంద్ర నిర్మించిన గోకులం షెడ్‌ను డ్వామా పీడీతో పాటు పశుసంవర్థక శాఖ జేడీ శ్రీనివాస్, ఏపీడీ లక్ష్మన్న, గ్రామ సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ ప్రారంభించారు. పీడీ వెంకటరమణయ్య మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువులను పెంచి అభివృద్ధి వైపు నడవాలని ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ నిధులతో 90 శాతం రాయితీ కింద గోకులం షెడ్లను నిర్మించుకునేందుకు ప్రోత్సహిస్తోందన్నారు. ఈ గోకులాలు రైతులకు వరంలా మారాయని తెలిపారు. గోకులాలతో రైతులు పాడి, పశువులను సంరక్షణ కల్పించి, అధిక ఉత్పత్తి సాధించి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. 4 గేదెలు/ఆవులకు అయితే రూ.1.85 లక్షలు, 6 గేదెలు/ఆవులు రూ.2.30 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం కుమార్ సాయినాథ్, కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏడీఏ పార్థసారథి, పశువైద్యాధికారి డా.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు

**కర్నూలు (టౌన్):** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 13న ఉండదని నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

## రేపటి నుంచి మీరసావలి ఉరుసు

- 13న గంధోత్సవం
- 14న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు
- 15న స్వాముల వారి కిస్తీలు

**ఓర్వకల్లు :** మండలంలోని హుసేనాపురం గ్రామంలో వెలసిన మీరసావలి నాసర్ షరీఫ్ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు షరీఫ్‌మియా శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది సంక్రాతి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా 13వ తేదీన గంధం వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాత్రి 10.30 గంటలకు అల్లాబకాష్ దర్గా నుంచి గంధాన్ని ప్రధాన బజారు గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి అర్ధరాత్రి 1.30 గంటలకు ధర్మకర్త మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతేహా, పూలు, గంధం, ప్రసాదం సమర్పిస్తామన్నారు. 14న స్వాముల వారికి ఉరుసు సందర్భంగా ప్రత్యేక ఫాతేహాలు ఉంటాయన్నారు. 15వ తేదీన సాయంత్రం 4 గంటలకు సర్కారు కిస్తీలు మహబూబ్ సుభాహని దర్గా నుంచి మీరసావలి దర్గా వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి, అశేష భక్తజన సందోహాల మధ్య స్వాముల వారికి సమర్పిండం జరుగుతుందన్నారు.

**14న కబడ్డీ పోటీలు**

ఉరుసు సందర్భంగా ఈ నెల 14వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రామదాసు, భూపతిరావు తెలిపారు. గ్రామ పెద్దలు, దాతల సహకారంతో నిర్వహించే పోటీలలో గెలుపొందిన జట్లకు నాలుగు స్థానాలకు గాను వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల వారు రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి 14వ తేదీ 10 గంటలలోగ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99490 73763, 90003 85443 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.